# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-02-2026 సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీ వేదికగా జరిగిన ఇండియా ఏ ఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను పొందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో స్థానికుల అస్వస్థత, మరణాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.**

3. **సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసే వారిని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

4. **రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణకు, పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

==========================

ఢిల్లీ వేదికగా జరిగిన ఇండియా ఏ ఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు స్పందిస్తూ, సంస్కృత సుభాషితాన్ని పంచుకున్నారు. ఈ చారిత్రాత్మక ఏ ఐ సదస్సులో భారతదేశ సామర్థ్యాలు ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రశంసలను పొందిందని అన్నారు. సాంకేతిక రంగంలో దేశ యువత భవిష్యత్తును నిర్దేశించడంలో ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

--------------------------

తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ లో స్థానికుల అస్వస్థత, మరణాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. కల్తీ పాల కారణంగా అనారోగ్యం బారిన పడిన ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న వైద్యసాయాన్ని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలని సూచించారు. స్థానిక పాల నమూనాల్లో ఫలితాలను పరీక్షలకు పంపాలని, అనంతరం విక్రయదారులపై కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

--------------------------

తూర్పు గోదావరి జిల్లాలో అనూరియా -మూత్రపిండాల వ్యాధి కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. రాజమహేంద్రవరంలో ఆమె ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, లాలా చెరువు చౌడేశ్వరినగర్, దివాన్ చెరువు స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో అనూరియా లక్షణాలతో వివిధ ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో తక్షణ చర్యల బృందాల ద్వారా పాలతో పాటు ఇతర నమూనాలను సేకరిస్తున్నామని కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రెండు రోజుల విరామం తర్వాత రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమైయ్యాయి. శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభను ప్రారంభించారు. ప్రశ్నోత్తరాలలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. శాసనసభలో ఈరోజు పలు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆంధ్రప్రదేశ్ జైళ్లు, సంస్కరణ సర్వీసుల బిల్లు-2026ను హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టనున్నారు. రైతుల నీటి పారుదల వ్యవస్థల యాజమాన్య సవరణ బిల్లును జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రవేశపెట్టారు. అలాగే విద్యుత్ చట్టంలోని 182వ సెక్షన్ ప్రతులను విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సభలో పెట్టనున్నారు.

---------------------------

సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసే వారిని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, విద్వేషపూరిత వ్యాఖ్యలకు పాల్పడే వారిపై తీసుకుంటున్న చర్యలు గురించి సభ్యులు ప్రశ్న అడగగా మంత్రి సమాధానమిచ్చారు. సామాజిక మాధ్యమాలతో లాభాలతో పాటు నష్టాలు అధికమవుతున్నాయని చెప్పారు. డిజిటల్ మాధ్యమాల నియంత్రణకు విదేశాల్లో అవలంబిస్తున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

స్వచ్ఛ రథాల ద్వారా పనికిరాని వస్తువులను సేకరించి వారికి అవసరమైన నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని భీమిలి మండలం తాటితూరు, ఆనందపురం మండలం ఎల్.వి.పాలెం, పెందుర్తి మండలం ఎస్.ఆర్. పురం గ్రామ పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అందజేసిన మూడు స్వచ్ఛ రథాలను కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ రోజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతీ మండలంలో 'స్వచ్ఛ రథాలు' కేటాయించి చెత్త సేకరణ, రవాణాను మెరుగుపరచనున్నామని తెలిపారు.

--------------------------

విజయవాడలో జాతీయ పింఛన్ వ్యవస్థపై అవగాహన కార్యశాలను ఈ నెల 25 వ తేదీన నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అసిస్టెంట్ డైరెక్టర్ చైతన్య రెడ్డి ఈరోజు

ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు –MSME లలో పనిచేసే వారికి ఆర్థిక భద్రత కల్పించే వివరాలతో పాటు , పదవీ విరమణ ప్రయోజనాలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నామని చెప్పారు. అలాగే జాతీయ పింఛన్ పథకం, ప్రయోజనాలు వంటి అంశాలగురించి వివరించనున్నామని పేర్కొన్నారు.

-------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా –పీఎం శ్రీ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను పరిశీలించేందుకు కేంద్ర బృందం ఈరోజు నుంచి జిల్లాలో పర్యటిస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర నోడల్ అధికారి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం రెండు రోజులపాటు నెల్లూరు జిల్లాలోని పలు పాఠశాలను సందర్శించి, వసతుల కల్పనపై పరిశీలన చేస్తుందని వెల్లడించారు. పరిశీలన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి ఈ బృందం నివేదిక సమర్పిస్తుందని ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ఈ ఏడాది మొదటి సంవత్సరం పరీక్షలకు 5,31,275 మంది విద్యార్థులు హాజరవుతుండగా, రేపటి నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది.మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

--------------------------

రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణకు, పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల ప్రశ్నోత్తరాలలో భాగంగా జలవనరుల శాఖలో ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణ వ్యవస్థపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, రాష్ట్రంలో 1008 ఎత్తిపోతల ప్రాజెక్టులు ఉంటే వీటిలో 613 పని చేయడం లేదని, కేవలం 158 మాత్రమే పని చేస్తున్నాయని పేర్కొన్నారు. వీటి నిర్వహణకు నిధులను మంజూరు చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

--------------------------

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో ఈ రోజు సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. ఈ సమావేశంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. విజయనగరంలోని విజ్జి క్రీడా సముదాయంలో నిర్వహిస్తున్న క్రికెట్, టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్, రన్నింగ్ ట్రాక్స్ వంటి క్రీడలకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నీ క్రీడావిభాగాలలో ఎంపిక పారదర్శకంగా జరగాలన్నారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారుల ఎంపిక ద్వారా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి, జిల్లాకు ఖ్యాతి తెస్తారని తెలిపారు.

====================